# కళాకారుని కడపటి కోరిక



– విన్నకోట విజయరాం

సోమిదేవమ్మగారి శోకానికి అంతు లేకుండా ఉంది. చుట్టూ ఉన్న వారెవ్వరూ ఆమెను ఆపలేక పోతున్నారు. అనంతంగా ఉన్న ఆ శోకానికి కారణం తన భర్త మరణం ఒక కారణం అయితే ఆ శవం రెండు రోజులైనా అక్కడే ఉండటం ఆవిడ శోకాన్ని రెట్టింపు చేస్తోంది. వీధిలో ఉన్న వారందరూ శవాన్ని తీసెయ్యమని వత్తిడి తెస్తున్నారు. కానీ ఆవీడ మాత్రం తన భర్త ఆఖరి కోర్కె తీరనిదే శవదహనం కాకూడదు అని పట్టుపడుతోంది. అవును ఆయన ఆఖరి కోర్కె అది. ఆవిడ తీర్చేది కాదు. ఒకరి మీద ఆధారం. అది అంత తీరని కోర్కె కోరుకున్నాడా తన భర్త కాదే, కానే కాదు. అసలు ఏమిటా కోర్కె తనతో నటిస్తూన్న వారందరికి ఆదర్శ పురుషుడు ఆయన. ఎందరినో రంగస్థలానికి అందించిన వ్యక్తి. తన జీవితాన్ని, తన నటనను పుణికిపుచ్చుకొన్న ఆయన ఒరవడిలో ఒదిగి, ఎదిగిన ఒక శిష్యుడు ఆయన శవాన్ని దహనం చెయ్యాలని ఆయన ఆఖరి కోరిక.

అన్నేళ్ళ సంసార జీవితంలో ఆయన తన అర్థాంగిని కోరుకున్న చిన్న కోరిక. ఏ రోజు ఆయన ఇది వండి పెట్టమనిగాని తనను ఇది కావాలనిగ్గాని అడగలేదు. కష్టాలను తను అనుభవించి సుఖాలను తన వారికి పంచి యిచ్చిన మనిషి. లోకం దృష్టిలో లౌక్యం తెలియని కళాకారుడు, వెర్రివాడు, నాటకాల పిచ్చివాడు. ఆయన పస తెలిసిన మనుష్యులకు ఆయన కామధేనువు, కల్పవృక్షము. ఎందరినో నటులను, రచయితలను పుట్టించి గగనసీమలో ఉంచటమేగాక తద్వారా వాళ్ళు లక్ష్మీపుత్రులై మహా రచయితలుగా, నటులుగా, దేశ విదేశాలలో పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. కానీ ఏనాడు వారు తమ గురువుగారి పేరు గాని, వారిని పదిమందిలో సత్కరించడం గానీ చేయలేదు. చేస్తే వారు చిన్నవారమై పోతామేమో అన్న అనుమానమేకాక వారు క్రిందిస్థాయిలోకి వస్తారనే ఆలోచన కూడా వారి హృదయాలలో చోటు చేసుకుందేమో.

అయినా ఆయన స్థితప్రజ్ఞుడై తన యజ్ఞాన్ని కొనసాగించాడు. ఎందరినో మరెందరికో కసిగా అందించాడు. ఆయన కర్మయోగిలా నిలిచాడు. యిది ఏమి అన్యాయం అని ఎవరైనా అడిగితే తను చిరునవ్వును మాత్రమే సమాధానంగా యిచ్చేవాడేగాని పరుషవాక్యం పలికేవాడు కాదు. అటువంటి అరుదైన మహాఋషులను సత్కరించని కాలం యిది. అయినా ఆయన బాధపడేవారు కాదు. ఒక సభ వారు ఆయన్ని సత్కరించడానికి బ్రహ్మ ప్రయత్నం చేశారు. అది కూడా వారి స్వార్థం. ఆయన వెనుక నున్న ఆయన శిష్యబృందం వినీలాకాశంలో ఉన్న తారలంతా వస్తారని, అతికష్టంమీద ఆయన అంగీకారం పొంది సభ చేశారు. కాని వాళ్ళకు నిరాశ ఎదురైంది. గురువుగారు అని వ్రాయడానికి వారికి మనస్సు అంగీకరించక ఫలానా వ్యక్తిగా సంబోధిస్తూ మీ కార్యక్రమం విజయవంతం కావాలని సందేశాలు పంపారు. దానికి కూడా ఆయనలో చలనం లేదు. ఎందుకంటే అన్ని పాత్రలు, వాటి స్వరూపాలు తెలిసిన మనిషి కనుక.

అంతటి వ్యక్తిత్వం ఉన్న మనిషి పోతే యిలా జరుగుతుందని ఆవిడ కాదు ఎవ్వరూ ఊహించలేదు.

సోమిదేవమ్మగారికి ఆయన మాటలు పదేపదే గుర్తువస్తున్నాయి.

నా పూజలు ఫలిస్తాయి. మీ కంటే ముందు నేనే పోతాను అని ఆవిడ అనేది. నేను కాలజ్ఞానం తెలిసిన నటరాజు స్వరూపాన్ని, నువ్వన్నా నమ్మవే ఈ నిజాన్ని అని ఆవిడ్ని పదే పదే హెచ్చరించేవారు. ఆవిడ నాటకధోరణి అనుకుంటు సరిపెట్టుకునేది. తన పిల్లల్ని ఒక డొక్క మాడ్చేది కాని ఏనాడు ఆయన శిష్యులను ఖాళీ కడుపుతో వెళ్ళనిచ్చేది కాదు. వారికి నచ్చేవిధంగా వండి వార్చేది. ఎంత పెద్ద నటులైనా వారు సోమిదేవమ్మగారి దగ్గరకొచ్చి ఒక్క ముద్ద తిని వెళ్ళాల్సిందే. ఎందుచేతనంటే వాళ్ళ యింట్లో అంతటి ప్రేమా హృదయంతో, అమృతహస్తంతో వండి వడ్డించేవారు లేక - చేతితో కాక మనస్సుతో వడ్డించేది ఆవిడ. నువ్వు ఫలానా సీనులో ఫలానా విధంగా చేస్తుంటే హాలులో వాళ్ళందరూ చప్పట్లు కొడుతుంటే ఎంతో ఆనందమేసిందోయ్ – నీకు ఈ విధంగా వండి వడ్డించడం చిన్నతనంగా ఉన్నది – అంతటి నటుడికి సేవ చేసుకునే అదృష్టాన్ని మీ గురువుగారి ద్వారా లభించినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది అనేది. ఆవిడ వంటను అందరూ మెచ్చుకునేవారే కాని – ఆవిడకు మట్టి గాజులు కూడా యివ్వకుండానే వెళ్ళిపోతూ పిచ్చి యిల్లాలు అని అనుకుంటూ వెళ్ళిపోయేవారు ఆ వినీలాకాశపు తారలు –

యిలా నటీనటుల ఆలయంతో పొంగి పారే ఆ జలప్రవాహం ఆయన మరణం – ఆయన శవం అలాగే ఉండడం – మరింత – మరింత బాధ పెడుతోంది ఆమెను.

ఏ కారు ఆగినా ఆ రచయిత వచ్చాడేమో అనుకుంటుంది.

కాని అతను రావడం లేదు –

ఆమెకు బాగా జ్ఞాపకం – ఆయన తన జీవితాన్ని – జీవించె ప్రాణవాయువును కూడా ధారపోసాడు – అతని ప్రతిమెట్టుకు కారణభూతుడై తనో నిచ్చెనై అతనిని పరమ పదసోపానానెక్కించాడు –

వెక్కివెక్కి ఏడ్చి ఇక ఏడవటానికి ఓపిక లేక ఊపిరి అందక అనంతంలో కలిసిపోయింది సోమిదేవమ్మ –

ఆ కాస్త పని ముగించారు కొడుకులు – ఒకేసారి ఖర్చు కలసివచ్చినందుకు కోడళ్ళు ఆనందపడ్డారు –

మరునాడు పేపర్లో పెద్ద వ్యాసం. వారి ఇరువురి గురించి టి.వి.లో వారి జీవిత విశేషాల గురించి ఒక మహా రచయిత విశేష రూపకం – అది అనేక మందిని ఆకట్టుకుంది. ఒక ప్రముఖ సినీ నిర్మాత ఆ కథా వస్తువును సినిమాగా తియ్యడానికి హక్కులు కొన్నాడు –

ఆ డబ్బును జాగ్రత్తగా లెక్క పెడుతున్నాడు ఆ రచయిత.

అప్పుడు కూడా స్పందించలేదు, చలించలేదు. ఆయన చివరి కోరిక – చివరి పెగ్గులో కూడా –

▲